## క్లుప్తంగా

### లయన్స్ ఆధ్వర్యంలో సుగర్ నిర్ధారణ పరీక్షలు



సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుగర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సామర్లకోట: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత సుగర్ పరీక్షల శిబిరానికి మంచి స్పందన లభించింది. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి సత్రంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్ఆర్వై ప్రసాద్ ప్రారంభించారు. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు డాక్టరు కర్రి ఆదినారాయణరెడ్డి సుగర్ పరీక్షలు నిర్వహించి రోగులకు సూచనలు, సలహాలు ఇచ్చి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 120 మందికి వైద్య పరీక్షలు చేసిన్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి బడుగు బాబి, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గుండు శంకర రావు, సేపెని సురేష్ సేవలందించారు.

### నేటి నుంచి సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ

సామర్లకోట: స్థానిక మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో మండల పరిధిలోని సర్పంచ్, గ్రేడ్ 1, గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులకు శిక్షణనిస్తామని ఎంపీడీఓ ఎస్డీ శ్యామ్‌సుందర్ ఆదివారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ రూమ్‌లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. పంచాయతీల పరిధిలో తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్ సమస్యలపై శిక్షణ కార్యక్రమంలో ఉంటుందని చెప్పారు. ఈ శిక్షణకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

### ప్రమాదకరంగా పైపులైన్ వాల్వ్ చాంబర్



నాగులాపల్లిలోని ప్రధాన కూడలిలో ప్రమాదకరంగా ఉన్న వాల్వ్ చాంబర్

కొత్తపల్లి: నాగులాపల్లి శివాలయం సెంటర్‌లో తాగునీటి పైపులైను వాల్వ్ చాంబర్ ప్రమాదకరంగా ఉంది. వాల్వ్ చాంబర్ ప్రధాన కూడలిలో ఉండడంతో దీనిపై విరిగిపోయిన కుర్చీని అడ్డంగా ఉంచారు. దీంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ చాంబర్‌పై దృష్టి సారించాల్సిన పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ వాల్వ్ చాంబర్‌ను పూర్తిగా మూసివేసి ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సామర్లకోట: పట్టణ పరిధిలో బీజేపీ నాయకులు ఆదివారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పోలీసు రింగ్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్, మఠం సెంటర్, మెహర్ కాంప్లెక్స్ వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్ దాడుల్లో మరణించిన హిందువుల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

### రక్తదాన శిబిరం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదివారం యువత సేవా సంఘం ప్రారంభోత్సవం సందర్భంగా అభయ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తం లభించని సమయంలో దానం చేసిన రక్తం ప్రాణ రక్షణకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, దుళ్ల లచ్చబాబు, యాదాల రామకృష్ణ, పెండాల అమ్మన్న, కొల్లు బాబూరావు, బత్తుల శ్రీను, శీరం రమణ, అల్లం దొరబాబు, ఓరుగంటి పెదబాబు, దమ్ము చిన్న, పెంకే శ్రీను పాల్గొన్నారు.

### సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: సారా విక్రయిస్తుండగా ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తమూలపేటకు చెందిన గుబ్బం హరిబాబు సారా విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడిచేసి హరిబాబును అరెస్టు చేసి తన వద్ద నుంచి 20లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# కాజ్‌వేకు కోత..రైతులకు అవస్థ

- ఏలేరు కాలువపై కాజ్‌వేలు శిథిలం
- ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు
- వంతెనలు పునర్నిర్మించాలంటున్న ప్రయాణికులు



వీకే రాయపురం వద్ద ఏలేరు కాలువ ఉధృతికి కోతకు గురైన కాజ్‌వే



వీకే రాయపురం ఏలేరు కాలువపై శిథిలమైన కాలిబాట వంతెన రైలింగ్

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురం, బోయనపూడిలో ఉన్న కాజ్‌వేలు శిథిలమై ఏళ్ల గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బోయనపూడి గ్రామంలో ఉన్న కాజ్‌వే సుమారు 22 ఏళ్ల క్రితం శిథిలమైంది. దాంతో ఆ గ్రామానికి చెందిన రైతులు వీకే రాయపురంలోని కాజ్‌వే మీదుగా పొలాలకు వెళ్లే వారు. వీకే రాయపురంలోని కాజ్‌వే తొమ్మిది ఏళ్ల క్రితం శిథిలమవడంతో అప్పటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేడు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత ఐదేళ్లలోనూ మూడు పర్యాయాలు కాజ్‌వేకు మరమ్మతులు చేసినా ఏలేరు ఉధృతికి కోతకు గురి అవుతూనే ఉంది. వీకే రాయపురం శివారు ప్రాంతమైన సత్యవరపుపేట ఏలేరు కాలువ ఆవలి వైపు ఉంది. ఆ ప్రాంతంలో సుమారు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. దీనికి తోడు ఆ ప్రాంతంలో ఎలిమెంటరీ పాఠశాల కూడా ఉంది. వీకే రాయపురం, బోయనపూడి గ్రామాలు కాకినాడ రోడ్డులో గోదావరి కాలువ ఆవలి వైపు ఉన్నాయి. ఆయా గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఏలేరు కాలువ ఆవలివైపు ఉన్నాయి. పొలాల్లోకి ఎడ్ల బండ్లు ట్రాక్టర్లు వెళ్లే విధంగా ఏలేరు కాలువలో కాజ్‌వేలను రెండు గ్రామాల్లోనూ ఏర్పాటు చేశారు. ఏలేరు కాలువ నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో వీకే రాయపురం వద్ద ఉన్న కాలిబాట వంతెన మీదుగా పొలాలకు వెళ్లి పశువులకు గడ్డి తీసుకొని వస్తున్నారు.

**వంతెన నిర్మాణంతోనే సమస్యకు పరిష్కారం**

బోయనపూడి, వీకే రాయపురం రైతులకు ఉపయోగపడే విధంగా వంతెనను నిర్మించాలని రైతులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. భారీ వర్షాలు, వరదలు వచ్చిన ప్రతిసారి 9 ఏళ్లుగా కాజ్‌వే కోతకు గురవుతూనే ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరినాట్లు, ధాన్యం తీసుకొని వచ్చే సమయంలో మరింత ఇబ్బందికరంగా ఉంటోందని రైతులు అంటున్నారు.

### రైతుల సమస్యలు పరిష్కరించాలి



గతంలో రెండు పర్యాయాలు కలెక్టరు నుంచి విడుదలైన నిధులు, వీకే రాయపురం గ్రామానికి చెందిన రైతు సంఘం నుంచి విడుదలైన నిధులతో ఏలేరు కాలువలోని కాజ్‌వేను మూడు పర్యాయాలు మరమ్మతులు చేశారు. ఎనిమిదేళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తూటేరు డ్రెయిన్ గ్రామ రైతులకు శాపంగా మారింది.

– ఇంటి వెంకట్రావు, రైతు, వీకే రాయపురం

### ఏలేరు కాలువపై వంతెన నిర్మించాలి



ఏలేరు కాలువ ఆవలి వైపు రైతులకు చెందిన సుమారు మూడు వేల ఎకరాలు పంట భూములు ఉన్నాయి. సత్యవరపుపేటలో సుమారు వెయ్యి మంది వరకు నివాసం ఉంటున్నారు. వీరి సమస్యల శాశ్వత పరిష్కారానికి వంతెన నిర్మాణం చేపట్టాలి. కాజ్‌వే తరచూ కోతకు గురి కావడంతో పాటు ఏలేరు కాలువపై ఉన్న కాలిబాట వంతెన రైలింగ్ శిథిలమైన ప్రమాదకరంగా ఉంది.

– శివకోటి శివరామకృష్ణ, ఎంపీటీసీ, వీకే రాయపురం

### ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



వీకే రాయపురంలో నీట మునిగిన పంట భూములను పరిశీలించిన సమయంలో కాజ్‌వే పరిస్థితిని గమనించాం. ఈ సమస్య పరిష్కారానికి తన వంతుగా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకు వెళతాను. గతంలో ఎంపీడీఓతో కలిసి కలెక్టరు దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు.

– ఐ సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

### సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పని సరి

కొత్తపల్లి: కాలానుగుణంగా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారిణి సౌజన్య అన్నారు. మండలంలోని నాగులపల్లి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు కారణంగా సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉన్నందున తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఈ కాలంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఫ్లూ జ్వరాలు అధికంగా వచ్చే అవకాశం ఉందని అటువంటి వారిని ఉపాధ్యాయులు గుర్తించి పాఠశాలలకు రాకుండా ఇళ్ల వద్దే విశ్రాంతి తీసుకునేలా చూడాలన్నారు. పాఠశాలకు వస్తే ఇతర విద్యార్థులకు కూడా ఈ ఫ్లూ జ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీలేదు. లక్షణాలకు అనుగుణంగా చికిత్సను అందించాలన్నారు. ఈ వ్యాధికి ప్లేట్‌లెట్స్ తగ్గుతాయని తెలిపారు. డెంగీని వ్యాప్తిచేసే ఏడిస్ దోమ పగటి పూటే కుడుతుందన్నారు. ఈ దోమ కుట్టినప్పటి నుంచి ఒళ్లు నొప్పి, కళ్లు లాగడం, వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడంతోపాటు పలు లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా ఇళ్ల వద్ద మురికినీరు, నిరుపయోగంగా ఉండే డ్రమ్ములు, రుబ్బురోళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వేడి పదార్థాలు భుజించడం, కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. పిల్లలకు పళ్ల రసాలు ఎక్కువగా ఇవ్వాలన్నారు.

## మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురంలో ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శ్రావణ మాసం మొదటి ఆదివారం సైతం మరిడమ్మను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ క్యూ కట్టారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు చేపట్టారు. ఆలయ జాతర మహోత్సవం తాత్కాలిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సీఐ టి.క్రాంతికుమార్ పర్యవేక్షణలో ఎస్సై మౌనిక ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు.

## తూరలు వేసి.. గొయ్యిని పూడ్చి

సాక్షి ఇంపాక్ట్



వీకే రాయిపురం-సత్యవరపుపేట రోడ్డులో తూర ఏర్పాటు చేసి గొయ్యిని పూడ్చిన దృశ్యం

సామర్లకోట: వీకే రాయపురం – సత్యవరపుపేట రోడ్డుకు పడిన రంధ్రాన్ని పూడ్చారు. ఈ రోడ్డు దిగువ భాగంలో బోయనపూడి, ఏపీత్రయం లోని పంట భూములకు సాగునీరు వెళ్లడానికి గోదావరి కాలువ నుంచి వీకే రాయపురం రోడ్డు దిగువ భాగం నుంచి తూరలు ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలకు తూర పగిలి 20 రోజులైనా ఎవరూ పట్టించుకోలేదు. దీనిపై సాక్షిలో ప్రమాదం జరిగేతేనే గాని పట్టించుకోరా శీర్షికతో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఇరిగేషన్ అధికారులు తూరలు ఏర్పాటు చేయాల్సి ఉండగా వారి నుంచి స్పందన రాలేదు. ఆ రోడ్డులో రోజు రోజుకూ రోడ్డుపై రంధ్రం పెద్దది కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పంచాయతీ నిధులతో శనివారం తూరలను ఏర్పాటు చేసి రోడ్డును గ్రావెల్‌తో పూడ్చి వేసినట్టు పంచాయతీ కార్యదర్శి వై శ్రీహరి ఆదివారం తెలిపారు.

## గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

కాకినాడ రూరల్: కాకినాడ నగర గణేశ ఉత్సవ సమితి సమావేశం స్థానిక గంగరాజు నగర్ 3వ వీధిలో ఆదివారం నిర్వహించారు. సమితి కో కన్వీనర్ గ్రామీణ పదాధికారి రంభాల వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి సమితి కన్వీనర్ యెనిమిరెడ్డి మాలకొండయ్య అధ్యక్షత వహించారు. సమితి గౌరవ అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ పర్యావరణ హితంగా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. మాలకొండయ్య మాట్లాడుతూ గణేశ ఉత్సవాల నిర్వహణకు అన్ని శాఖల అధికారుల నుంచి సహకారం కోరుతున్నామన్నారు. రంభాల వేంకటేశ్వరరావు మాట్లాడుతూ సిటీలో జగన్నాథపురం రెండు వంతెనల నడుమ వార్ఫ్ రోడ్డు, వినాయక సాగర్, రూరల్‌లో సూర్యారావుపేట సముద్రతీరంలో సెప్టెంబర్ 16న గణేశ నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. సమితి సీనియర్ కార్యనిర్వాహకులు బొలిశెట్టి వేంకట రామకృష్ణ పెండెం సత్య నారాయణ , దిలీప్ కుమార్ సదనాని పాల్గొన్నారు.

# దళితులపై దాడులను ఖండించాలి



డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పీవీ రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పిఠాపురం: స్థానిక మాల మహానాడు కార్యాలయంలో ఆదివారం 26వ మాల మృతి వీరుల సంస్కరణ సభ జిల్లా అధ్యక్షుడు దారా వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పీవీ రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు మాట్లాడుతూ గతంలో పీవీ రావు పిలుపు మేరకు చలో అసెంబ్లీ ప్రకటించగానే రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల మంది మాలలు ఉద్యమంలో పాల్గొని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఆ కార్యక్రమాన్ని అడ్డుకోవడం కోసం, ఆనాటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆందోళనకారులను గుర్రాలతో తొక్కించి, బాష్పవాయువు ప్రయోగించి, లాఠీలతో దాడి చేయించి, తుపాకీలతో కాల్పులు జరిపారన్నారు. ఆ ఘటనలో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురానికి చెందిన పాణంగి శేషయ్య, ఒంగోలు పట్టణం ఓవుతోట నారాయణ ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1న సుప్రీంకోర్టు చెప్పిన తీర్పు ప్రకారం వెనుకబాటు ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణ చేయడానికి రాష్ట్రాలకు అధికారం ఇవ్వడం, క్రిమిలేయర్ అమలు చేయడాన్ని మాల మహానాడు పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో దళితులపై జరుగుతున్నా దాడులను ఖండించడం లేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవడంలేదన్నారు. విజయవాడలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ స్మృతి వనంలోకి ప్రవేశించి శిలాఫలకం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో యాండ్ల లక్ష్మీపతి, ములగపాటి బుచ్చిరాజు, దడాల సత్తిబాబు, దుర్గాడ సింహాచలం బందిలి సూరిబాబు, దడాల చిన్నబాబు పాల్గొన్నారు.

### ఉచిత హోమియో వైద్య శిబిరం

కొత్తపల్లి: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఆదివారం శ్రీమ్ అపర్ణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పాలిటెక్నిక్ విద్యార్థిని రాయవరపు అనుగ్రహ చదువు ఖర్చు సహాయార్థం రూ.8,500 చెక్కును అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కంటి వైద్య పరీక్షల్లో విద్యార్థిని కాదా అపర్ణకు టోక్సోప్లాస్మోసిస్ నిర్ధారణ కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4,200 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఏ. వెంకటేశ్వర శర్మ, సభ్యులు బత్తుల వీరబద్రం, డాక్టర్లు సూర్య పవన్‌రామ్, నాగ మనోజ్ఞ పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో కావడి యాత్ర



సామర్లకోటలో జైనుల కావడి యాత్ర

సామర్లకోట: జిల్లాలోని జైనులు ఆదివారం కావడి యాత్రను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జగ్గంపేట నుంచి ప్రారంభమైన యాత్ర సామర్లకోటలో జైనులు స్వాగతం పలికారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఏటా శ్రావణ మాసంలో కావడి యాత్ర నిర్వహిస్తామని జైనులు తెలిపారు. ఈ మేరకు బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని నినాదాలు చేశారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్, స్టేషన్ సెంటర్, ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయానికి కావడి యాత్ర చేరుకుంది. ఈ కావడి యాత్రలో మహిళలు, పిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైనులు కావడితో తీసుకొచ్చిన నీటితో పంచారామ క్షేత్ర ఆవరణలోని శివలింగానికి అభిషేకాలు చేశారు.

## అర్బన్ ప్రాంతాలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలి

కాకినాడ సిటీ: పాలక వర్గాలు లేని తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాల, వాకలపూడి, రమణయ్యపేట అర్బన్ ప్రాంతాలను కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్ డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ సెంటర్ శాఖ సమావేశం ఆదివారం కాకినాడ సుందరయ్య భవన్‌లో కె సింహాచలం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 13 ఏళ్లుగా ఈ ఆరు ప్రాంతాల్లో పాలకవర్గాలు లేకపోవడం వల్ల ఈ గ్రామాల్లో మంచినీరు, డ్రెయినేజీ, సామాజిక స్థలాల పరిరక్షణ లాంటి అనేక సమస్యలు పేరుకుపోయాయన్నారు. ఇన్‌ఛార్జి అధికారుల పాలన వల్ల ఈ గ్రామాల్లో అవినీతి విపరీతంగా పెరిగిందన్నారు. ప్రజాసమస్యలు పట్టించుకునే నాథుడే లేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో గవర్నర్ ఆదేశాలతో ఈ గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం కావడంతో రికార్డులో ఇవి అర్బన్ ప్రాంతాలుగా ఉన్నాయని గుర్తు చేశారు. సాంకేతిక కారణాలతో ప్రభుత్వం ఇప్పటికీ కార్పొరేషన్‌లో విలీనం చేయడపోవడాన్ని రాజశేఖర్ తప్పుపట్టారు. కార్పొరేషన్‌లో విలీన ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం కోరుతుందన్నారు. సీపీఎం నేతలు సీహెచ్ అజయ్‌కుమార్, కె వీరబాబు, సీహెచ్ రమణి పాల్గొన్నారు.

# ఎనీటైమ్.. పనిచేయవు!

- మొరాయించిన నగరంలోని ఏటీఎంలు
- ఆరు నెలలకోసారి చార్జీల వసూలు
- సీడీఎంల పరిస్థితి మరింత అధ్వానం
- అయోమయంలో ఖాతాదారులు




రాజేశ్వరినగర్‌లో పనిచేయని సీడీఎం యంత్రం



భానుగుడి సెంటర్‌లో పనిచేయని ఏటీఎం

బోట్‌క్లబ్: అత్యవసర పరిస్థితుల్లో నగదు కోసం ఏటీఎంలకు పరుగుతీసినా అక్కడ నో క్యాష్ బోర్డు దర్శనమిస్తుంది. ఆపసోపాలు పడి మరో బ్యాంకు ఏటీఎం దగ్గరకు వెళ్లినా అది కూడా మూసివేసి ఉంటుంది. దీంతో ఖాతాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాకినాడ నగరంలో ఒక్క ఎస్‌బీఐ బ్యాంకుకు సంబంధించి 23 శాఖలు ఉన్నాయి. ఒక్కొక్కశాఖలో 70 నుంచి లక్ష వరకూ ఖాతాదారులున్నారు. ఈ ఖాతాదారుల నుంచి ఏటీఎం వినియోగించినందుకు చార్జీల రూపంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి రూ. 180 వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్క ఎస్‌బీఐ వినియోగదారులు నుంచి కాకినాడ నగరంలో ఆరు నెలలకు రూ. 37.26 కోట్లు వసూలు చేస్తున్నారు. ఎస్‌బీఐ ఏటీఎంలు మాత్రం ఎక్కడా సక్రమంగా పని చేయవు. చార్జీలు మాత్రం ఖాతాదారుని ఖాతా నుంచి లాగేసుకుంటున్నారు. సేవలు మాత్రం సక్రమంగా అందించడం లేదు. ఇక యూనియన్ బ్యాంకులు, కెనరా బ్యాంకుతోపాటు ఇతర బ్యాంకు వందకు పైగా శాఖలు ఉన్నాయి. వాటన్నింటికీ క్రమం తప్పకుండా ఏటీఎం చార్జీలు వసూలు చేస్తున్నప్పటికీ ఆయాశాఖలకు చెందిన ఏటీఎంలో మాత్రం డబ్బులు మాత్రం ఉండడం లేదు.

**పని చేయని సీడీఎంలు**

సీడీఎం (క్యాష్ డిపాజిట్ మెషిన్)లు కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదారులు పడరాని పాట్లు పడుతున్నారు. అత్యవసరంగా ఖాతాల్లో డబ్బులు వేసుకునేవారు కొందరైతే, వేరేవాళ్లకు డబ్బులు పంపేవారు మరికొందరు. స్టేట్‌బ్యాంకు, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకుతో పాటు పలు బ్యాంకులు ఆయా బ్రాంచ్‌లు సమీపంలో సీడీయం మిషన్లు ఏర్పాటు చేసింది. కానీ ఇవి సక్రమంగా పని చేయడం లేదు. అవసరానికి డబ్బులు వేస్తే మిషన్ మరమ్మతుల కారణంగా సగంలోనే ఆ ప్రక్రియ నిలిచిపోవడంతో డబ్బులు ఖాతాల్లో పడక, వినియోగదారుడు చేతికిరాక దిక్కుతోచక ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నాడు. సీడీఎంలో డబ్బులు వేసే సమయంలో నెట్‌వర్క్ సక్రమంగా లేకపోతే డబ్బులు తమ ఖాతాలో జమకావు. దీంతో బ్రాంచ్‌కు వెళ్లి పరిస్థితి వివరించి అక్కడ దరఖాస్తు చేసుకుంటే అక్కడ సిబ్బంది పరిశీలించి నాలుగైదు రోజుల్లో ఆ నగదు మన ఖాతాల్లో వేస్తారు. అవసరం కోసం డబ్బులు వేస్తే నాలుగైదు రోజుల వరకూ డబ్బులు జమ కావడం లేదని వినియోగదారులు అంటున్నారు. దూర ప్రాంతాల్లో చదువుకుంటున్న తమ పిల్లల ఖాతాల్లో డబ్బులు వేసినా వారికి అవి వేగంగా అందకపోవడంతో తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ బాధలు పడలేక నేరుగా ఖాతాల్లో డబ్బులు వేద్దామని అనుకుంటే బ్యాంకుల్లో చిన్న మొత్తాలు సీడీఎంలో వేసుకోవాలని పెద్ద మొత్తం మాత్రమే ఇక్కడ డిపాజిట్ చేయాలని సిబ్బంది ఖాతాదారుల చెప్పడంతో వారు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. కొన్ని బ్యాంకుల్లో చిన్న మొత్తాలను తీసుకోని పరిస్థితి ఉంది. రూ. 50 వేలు పైబడి డిపాజిట్ చేసేవారు మాత్రమే బ్యాంకులకు రావాలని, తక్కువ మొత్తం డిపాజిట్లు తీసుకోవద్దన్న నిబంధనలున్నాయని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు.

### సీడీఎంలు ఉపయోగపడటం లేదు



బ్యాంకు సమయం ముగిసిన తర్వాత ఎవరికైనా అత్యవసరం డబ్బులు పంపుదామని సీడీఎం మెషీన్ వద్దకు వెళితే అవి పనిచేయడం లేదు. ఎవరైనా సీడీఎంలో డబ్బు వేసినా మా ఖాతాల్లోకి వేగంగా జమ కావడం లేదు. మళ్లీ బ్యాంకుకు వెళ్లి ఫిర్యాదు చేసిన నాలుగైదు రోజులు తర్వాత మా ఖాతాల్లోకి వస్తున్నాయి. దీంతో అవసరం తీరడం లేదు.

– దొరబాబు, వ్యాపారి

**వినియోగించేవారు తక్కువే**

ప్రస్తుతం ఏటీఎం వినియోగించే వారు బాగా తగ్గిపోయారు. ప్రస్తుతం ఫోన్ పే, గూగుల్ పే, పేటీయం వంటి యూపీఐ సేవలు అందుబాటులోకి రావడంతో దాదాపు 90 శాతం మంది వీటిపైనే ఆధారపడుతున్నారు. ఏటీఎంలు వినియోగించేవారు 10 శాతం మాత్రమే ఉంటున్నారు. వినియోగించేవారు తక్కువగా ఉన్నా ఏటీఎంలో క్రమం తప్పకుండా డబ్బులు పెట్టకుండా ఖాతాదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. డబ్బులు అయిపోయిన రెండు మూడు రోజులకు కూడా నింపకపోవడంతో ఖాతాదారులకు అవస్థలు తప్పడం లేదు.

**ఏటీఎంలలో డబ్బు నింపే పని ప్రైవేటు ఏజెన్సీలకు..**

ఏటీఎంలో డబ్బులు నింపే పనిని ఆయా శాఖలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి బ్యాంకులు చేతులు దులుపుకుంటున్నాయి. డబ్బులు అయిపోయిన వెంటనే ఆయా ఏటీఎంలో డబ్బులు నింపకపోవడంతో తరచూ ఏటీఎం వినియోగదారులు బాధలు వర్ణానాతీతం. సొంతంగా బ్యాంకు డబ్బులు నింపే ఏటీఎంలో కాస్త మెరుగుగానే సేవలు అందుతున్నాయి. అక్కడ ఖాతాదారులు ఫిర్యాదు చేస్తే వెంటనే సిబ్బంది ఏటీఎంలో డబ్బులు నింపుతున్నారు.

### పెద్దాపురం తహసీల్దార్‌గా వెంకటలక్ష్మి బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటలక్ష్మికి స్వాగతం పలుకుకుతున్న సిబ్బంది

పెద్దాపురం: పెద్దాపురం తహసీల్దార్‌గా సీహెచ్. వెంకటలక్ష్మి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు పని చేసిన శ్రీనివాసరెడ్డి విజయవాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కృష్ణా జిల్లాలో పని చేస్తున్న వెంకటలక్ష్మి పెద్దాపురం తహసీల్దార్‌గా బదిలీపై ఇక్కడికి వచ్చారు. పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయాల ఏఓగా పని చేసిన ఆమె ఎన్నికల విధుల్లో భాగంగా కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు.సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా పెద్దాపురం తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో ఆమె ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మండల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమెకు డీటీ కాంతారావు, రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.